అతిథి

"ఒరేయ్!... ఒరెఒరేయ్!..."

నాక్కాలపడ్తోంది.

"ఒరేయ్!... విన్నేరా పిల్చేదీ—"

ఉలిక్కపడి లేచాను. ఎదటో వ్యక్తి. అయిదున్నర అడుగుల ఎత్తు. లాంగ్ కోటు, ధోవతి, సిల్కు కండువా, చేతిలో తోలు పెట్టి, నల్లగా, బొద్దుగా— ఆ వ్యక్తి ప్రత్యక్షం!... ఎవరూ?

"ఇప్పుడేం నిద్దర్రా?" అంటూ సరాసరి ఇంట్లోకి దూరుకొచ్చాడు.

నిలుచున్న వాడిని నిలుచున్నట్టుగానే వుండిపోయాను.

సూటిగా ట్రంకు పెట్టెవున్న చోటికి వెళ్ళాడు. అక్కడ తన పెట్టి పెట్టాడు. అక్కణ్ణించి తిన్నగా నా కోటు వున్న చోటికెళ్ళాడు. అక్కడ తన కోటూ, కండువా తగిలించాడు. తిరిగొచ్చి నేనింతవరకూనిద్రి స్తోన్న ఈజీచేర్లో వారిగి ధోవత్తో మొహాన చెమట తుడుచుకుంటూన్నాడు, ఇంతసేపూ నావేపు తిరిగన్నా చూళ్ళేదు.

ఇంకా కల కంటున్నానా?

"నిల్చున్నావేఁరా, కూర్చో," అన్నాడు పక్కన కుర్చీ చూపిస్తూ.

మాట్లాడకుండా వెళ్ళి కూర్చున్నాను.

ఈ 'రా' ఏవిఁటి? మా ఇంట్లో పెద్ద వాళ్ళూ, రాజూతప్ప నన్ను 'రా' అని పిలిచే వాళ్ళు ప్రపంచంలో మరెవ్వరూ లేరే? మరీయన నా దగ్గర ఇంతచనువు తీసుకుంటున్నాడే? ఎవరీయనా?... అసలెవరంటా?

ఇదంతా 'కలయో వైష్ణవమాయయో' అర్థంకాకుండా ఉంది నాకు.

"అదేఁరా, అట్టా చూస్తావేఁ? నన్నెరగవూ?"

ఈయన్నెరుగుదునా? ఎరుగుదునేమో. కాని ఎక్కడ చూశానూ? ఎప్పుడూ? ఎక్కడా చూసినట్టు లేదే.

"నేను ప్రసాదరావును కాదుట్రా?"

ప్రసాదరావా? ఏ ప్రసాదరావ్? నేనెరిగిందల్లా ఒక్క ప్రసాదరావేనే, నాటకాల్లో వేషాలువేసే ప్రసాదరావు. కాని ఆయన ఈయన కాదే. అందులో మొన్నేగా ఆ ప్రసాదరావు సజీవంగా లైబ్రరీలో అవుపడి నమస్కారం చేశాడు.

"ఇంకా తెలీలేదుట్రా?... పోనీ, మీ అమ్మా అన్నయ్యా వాళ్ళన్నా జ్ఞాపక మున్నారా?" అన్నాడు విసుక్కుంటూ.

"అయ్యో, వాళ్ళు జ్ఞాపకం లేకేమండీ?"

"మరి నేనట్రా జ్ఞాపకం లేందీ?"

అంటే ఈయనా నాకు అంతటి దగ్గిరి బంధువేన్నమాట. మరీయన్ని నేనెరక్కపోట మేవిఁటీ? ఆశ్చర్యం!

7)

"మీ పెద్దన్నయ్యా, నేనూ ప్రాణ స్నేహితులం కాదుట్రా? చిన్నప్పుడు నేనూ అయినా కలిసి గోలీలాడుతూంటే నువు మీ తాతయ్యా వొళ్ళో కూర్చుని చూసేవాడివి కాదుట్రా? నిన్ను నేను ఎన్నోసార్లు ఎత్తుకుని ఆడించా కదరా?"

పెద్దన్నయ్య పేరు వినగానే హడలెత్తింది. ఇంక లాభం లేదనుకున్నాను. ఈయన్ని నేను ఎరిగినా ఎరక్కపోయినా రాజీపట్టమే మంచిదని, బొంకాను: "ఆఁఆఁ, అవునండీ మరిచిపోయాను. మా అన్నయ్య మీ పేరు ఎప్పుడూ చెబుతూంటాడు."

"ఓరి నీ తస్సాదియ్యా! ఎంత గోల చేశావురా... మీ అన్నయ్యేగా నాకీ అడ్రసిచ్చిందీ, ఇట్లా అని తెలిసివుంటే మహారాజులా మరెక్కడైనా దిగేవాణ్ణే.

"రామరామ! ఎంతమాట. క్షమించాలి. ఏదో పొరబాటున జ్ఞాపకం రాకపోయింది."

"నాకు తెలుసులేరా. నీకూ పట్నం నీళ్ళు బుఱ్ఱకెక్కాయి...అబ్బే. నువ్విట్లా అవుతా వనుకోలేదురా" నా మనసుకు చాలా కష్టంవేసింది. నేను "ఇట్లా" అయానని కాదు. ఆయన మాట్లాడే ధోరణి సహించలేకుండా వుంది.

"మరిప్పుడు నిద్ర పోతున్నావేఁరా? ఇంకా ఆరన్నా కాలేదే," అన్నాడు ఒక్కసారి విషయం మారుస్తూ.

"మరేం లేదండీ, ఇవ్వాళ ఆఫీసులో కాస్త ఎక్కువ పనుండటం చాత వొళ్ళు అలిసినట్టయింది. అట్లా వొరిగానో లేదో కునుకు పట్టింది... అరెరె, మీరింకా అట్లానే కూచున్నారే. స్నానం చేస్తారా?"

"ఇప్పు డెవడు చేస్తాడ్రా."

"పోనీ, కాళ్ళూ చేతులన్నా కడుక్కోండి."

లేచాడు. వంటింట్లోకి దారి చూపించాను. ధోవతి చేతో పట్టుకుని ఠీవిగా నడుస్తూ వంటింట్లోకి కాలు పెట్టాడు. అడుగు పెట్టగానే గదంతా కలయచూశాడు. తిరిగి నాకేసి చూశాడు. ఆ కళ్ళల్లో నిరాశ కనుపించింది. మాట్లాడకుండా వెళ్ళి కాళ్ళూ, మొహమూ కడుక్కుని వచ్చాడు. తుండు గుడ్డ అందిచ్చాను. కాళ్ళు కుర్చీపైన పెట్టి తుడుచుకుంటూ అన్నాడు, "బ్రహ్మచర్యం ఆచరిస్తున్నావేంరా."

ఆ ప్రశ్న అంత హఠాత్తుగా వొచ్చినందుకు కొంచెం కంగారు కలిగింది.

"చిత్తం, ప్రస్తుతం అంతేనండీ"

"ఏం?"

"పుట్టింటి కెళ్ళిందండీ"

"ఓహోం అదా సంగతి? తెలిసింది"

ఏవిఁటి సంగతి? నాకు తెలియందాయనకేం తెలిసింది ? అపోహ పట్టంలేదు కదా?

"వూరకనే వెళ్ళిందండీ."

"అంతే?" అన్నాడు నిమ్మళంగా కూర్చుని నావేపు ప్రశ్నార్థకంగా తిరిగి.

"వొచ్చి చాలా రోజులైందనీ, అందులో వాళ్ళ అక్కయ్య కూతురు పెళ్ళనీ వాళ్ళ అన్నయ్య వొస్తే పంపించాను."

"అదేలేరా అన్నీ కలిసొస్తయి. అట్లానే పురుడోసుకొస్తుందిలే."

"అబ్బెబ్బే అట్లాంటిదేమీ లేదండీ," అన్నాను వెంటనే అందుకుని.

"ఏం?" అన్నాడు బొమలు ముడుస్తూ.

ఏం చెప్పనూ?

"ఏం లేదండీ," అన్నాను వూరుకోలేక.

"అమ్మాయి కాపరాని కొచ్చి ఎన్నేళ్ళయిందిరా?"

ఈ అడ్డు సవాళ్ళంతా ఏవిటీ? నాకు అసహ్యం వేసింది.

"రెండేళ్ళు"

"మరీ?"

ఏవిటి మరీ, నా శ్రాద్ధం! నడిబజారులో నన్ను మెడికల్ పరీక్ష చేసినట్టుగా వుంది.

"నాకు తెలుసులేరా మీ సంగతీ, మీరూ పెద్దపెద్ద చదువులు చదివి మరీ అన్యాయమై పోతున్నార్రా. దేవుడూ దైవం అంటే మీకు భయం పోయింది. పిల్లలంటే మీకు అసహ్యం కదూ?"

"అయ్యో! ఎందుకండీ?"

"ఎందుకేవిటి నాకు తెలీదూ? ఈ పట్నం వాళ్ళ సంగతి నన్నడుగు చెబుతా, అదేదో బర్త్ కంట్రోల్ అంటూ వుండటగా?..."

"రామరామ! చాలా అపోహ పడుతున్నారండీ."

"ఆఁ, నా దగ్గిరారా మీ ఆటలు?"

ఇంక భరించలేక పోయాను. వెంటనే ధోవతీ, తువాలా తీసుకుని, "స్నానం చేసి వాస్తా" నంటూ గబగబా మెట్లు దిగిపోయాను.

పంపు ధారకింద పది నిమిషాల పాటు నిశ్చలంగా కూర్చుని కాని మరీ తేరుకోలేదు. అప్పుడు కాస్త వేడి తగ్గింది. బుఱ్ఱ పనిచేయటం మొదలెట్టింది.

అసలు పొద్దున్నే లేచి ఎవరి మొహం చూశానో మరీ కష్టాలకు గురిఅయాను. లేకుంటే, ముక్కూ మొహం ఎరగని ఎవడో వొహడు ఇంట్లోకి దూరుకొచ్చి నా మొహం ముందట నన్నే చెడామడా తిట్టేస్తూంటే నేనేమీ అనలేక వాజమ్మలా కూచోటం ఏం ఖర్మమూ? నేనేం పాపం చేశానని నాకీ శిక్ష. పరీక్ష? బి.ఏ. పరీక్ష కూడా ఇంత కఠినంగా తోచలేదే.

ఇంతవరకు అతిథులంటూ— పిలిచిన వారూ, పిలవనివారున్నూ— చాలామంది ఈఇంటికి వచ్చారు; మళ్ళీ వాళ్ళమానాన వాళ్లు వెళ్ళిపోయారు. వెళ్ళని వారిని నేనూ, సుశీలా కలిసి వుపాయంగా దారి పట్టించాం. కాని వాళ్ళల్లో ఎవ్వరూ ఇంతవరకూ నన్ను గానీ, సుశీలనిగానీ పల్లెత్తు మాట అని ఎరగరు. కాని ఈయన మాత్రం వచ్చీ రావటమే నన్ను వేపుకు తింటం మొదలెట్టాడే! అసలీయన వచ్చిందే ఇందుకా?

నా ఈ పీడ వొదిలించుకోటం ఎల్లాగో తోచింది కాదు. ఇలాంటి మొండిఘటాలకోసమనే నేనూ, సుశీలా కలసి కొన్ని గోసాయి చిట్కాలు తయారు చేసి పెట్టుకున్నాం. కొన్నింటిని ఇదివరకే ప్రయోగించాం. కొన్ని ఇంకా అట్లానే మా హృదయ పేటికలో సీలు చేయబడి వున్నాయి. అందు లోంచి ఏది ప్రయోగించినా అతిథి అనేవాడు మళ్ళీ ఈ జన్మలో మా ఇంటి పేరు తలవడని మాకు బాగా నమ్మకం. లేకుంటే, ఈ పట్నంచోట ఆ వొచ్చే నూటా నలభై అయిదు రూకల్తో అతిథి సత్కారాలు చేస్తూ ఏం బతికేడుస్తాం చెప్పండి?

కాని రెణ్ణెల్ల క్రితం మాత్రం కొంచెం కథ అడ్డం తిరిగినందు వల్ల ఇప్పుడు కాస్త జాగ్రత్తగా వుండాలిసి వొస్తోంది. ఎం జరిగిందంటే— ఇలాంటి ఎరగని మొహమే ఒకడు మీ వూరివాణ్ణంటూ వచ్చాడు. సరేనని ఒకరోజు వుండనిచ్చాం. కాని అలాంటి మరి పది, పదిహేను రోజులైతే గాని ఆ ఘటం కదలనట్లు సూచనలు కనుపించాయి. ఇంకేం? వెంటనే అయ్యవారిని ఉద్వాసన పట్టించాలని నిశ్చయం చేసుకున్నాం. రెండో రోజు

సాయంత్రమే మా అతిథి ఎదటే సుశీల నన్నో మాట అనేసింది. దాంతో నేనుగ్రుణ్ణయి పోయి పెద్దగా అరిచాను. సుశీల వెనక్కి తీయలేదు. నా కంటే పెద్దగా గోల చేసింది. నేను నాలుగు తిట్టాను. అది ఏడ్చుకుంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది, నేనూ వెనకాలే వెళ్ళి మా అతిథికి బాగా విన పడేట్టు నాలుగు చరిచాను. సుశీల పెద్దగా యాడవటం మొదలెట్టింది. ఇలా అరగంట నాటకమాడాం. తర్వాత ఈవలికొచ్చి చూస్తే మా అతిథి తన బిఛాణాతో సహా మాయమైనాడు. ఆ రాత్రి హాయిగా నిద్ర పట్టింది.

కాని నాలుగు రోజుల తర్వాత మా పెద్దన్నయ్య దగ్గర్నించి వో వుత్తరం వొచ్చింది. తన స్నేహితుణ్ణి మేము అవమాన పరిచామనీ, అంతగా మాకు గతి లేకపోతే తనకు రాస్తే తానేమేనా పంపించేవాడనీ రాశాడు. నాకు చాలా కష్టమనిపించింది. అప్పట్నించి కాస్త జాగ్రత్తగా వుంటున్నాం.

మరీయనా పెద్దన్నయ్య ప్రాణ స్నేహితుణ్ణేననీ, ఇద్దరూ కలిసి గోలీలాడే వారనీ చెబుతూన్నాడే. అంచాతే ఈయన పైన డిసిప్లినరీ చర్య తీసుకుందామన్నా తీసుకోడానికి వీల్లేకుండా వుంది...

ఇంతలో వెనకాల ఏవరో మెల్లిగా దగినట్టనిపించి, వెనక్కి తిరిగి చూశాను. కొసా ఇంటివారి కోడలు బిందెతో సహా నిలుచుని వుంది. పాపం ఎంత సేపయిందో వొచ్చి? నేను గమనించనే లేదు. వెంటనే లేచి ఈవలి కొచ్చేసి పొడిగుడ్డ కట్టుకుని, కుంగిపోయిన హృదయంతో మెల్లిగా మెట్లెక్కాను.

పైకెళ్ళేసరికి అతిథిగారు చూరుకేసి చూస్తూ కూచున్నారు. నేను తిన్నగా వారి దృష్టిని తప్పించుకుంటూ గాలరీలో కెళ్ళి నిల్చున్నాను. ఆయనగారు ఏ క్షణాన ఏ బాంబు విసురుతారో అన్న భయంతోనే తల తుడుచుకుంటున్నాను. ఇంతలోకి "ఒరేయ్" అన్న పిలుపు వినిపించగానే

గుండె గుభేలుమంది. మళ్ళీ ఏం కొంప మునిగి పోతుందో నని భయపడు తూనే "ఏఁవండీ!" అన్నాను మెల్లిగా.

"ఇది అద్దె కొంపేఁరా?"

"మరేఁనండి."

"ఎంతా?"

"పాతికండీ"

"వోరి బాబో! పాతికే? ఎందుకింతా?"

"పట్నం కదండీ."

"అయితే? ఇక్కడ గోడలు బంగారంతో కట్టారా?... మనవూళ్ళో చూడూ, రెడ్డిగారి బంగళా వుందే అది పది రూపాయలకి అద్దె కిస్తామంటే ఎవరూ అడగటంలా."

ఏం చెప్పనూ?

"మరి పట్నంలో ఇంతేనండీ," అన్నాను, మరేం చాతకాక.

"వెధవ పట్నమూ, మీరూనూ, మీకేంరా, డబ్బు తగలేయటం మాత్రం వొచ్చు మీ పట్నం వాళ్ళకి. అందుకే మహాత్ముడేమన్నాడో తెలుసా?"

"నాతో ఏమీ అనలేదే?"

"నీతో కాదురా వెధవాయ్! నీలాంటి కుఱకుంకలతో అన్నాడు— "వెంటనే పల్లెలకు పొండి, అక్కడే మీకు స్వరాజ్యం లభిస్తుంది!" కాని మీరు వింటేనా? మీకు షోకులూ, టీకులూ కావాలెనాయె, మీరెందు కింటారూ?..."

ఇంక భరించలేక మొహం తిప్పేసుకున్నాను. మళ్ళీ తల తిరగ టం మొదలెట్టింది. బోనులో చిక్కిన ఎలకలా తన్నుకోసాగింది నా హృదయం. ఎటూ పాలు పోలా. కాని ఇది ఆట్టే సాగనివ్వద్దని మాత్రం నిశ్చయం చేసుకున్నాను. ఏదయితే అదయింది. ఈ శని మాత్రం విర గడ చేసుకుని తీరాలి. అన్నయ్యకి కోపం వాస్తే తర్వాత చూసుకుందాం.

కాని ఎట్లా? ఎట్లా ఈ మహానుభావుణ్ణి ఉద్వాసన పట్టించటం? నా హృదయ పేటికలో దాచివుంచిన గోసాయి చిట్కాలు వొక్కొక్కటే తీసి చూశాను. కాని వాటిలో వొక్కటికూడా ప్రస్తుతపు కేసులో సరిపోకపోటం చూసి నా గుండె ఇంకా బేజారై పూరుకుంది. అన్నింటిలోనూ సుశీల సహాయం తప్పనిసరైంది. అసలు ఎన్నడేనా ఇలా వొంటరిగా వ్యవహ రించాలిసి వొస్తుందేమోనన్న ఊహే మా కప్పుడు తట్టనందుకు చాలా విచారం వేసింది. కాని విచారించి లాభం? పోనీ కొత్తదేదేనా సృష్టిద్దా మంటే పాలు పోవటంలా. వొద్దని ఎంత ప్రయత్నం చేసినా ఆ మాటలు శూలపోట్లలాగా చెవిలో మారుమ్రోగుతున్నాయి.

కొంచెం సేపటికి ఆయన హఠాత్తుగా ఆగాడు. నే నెంత సేపూ ఏమీ జవాబివ్వనందుకు నాపైన దయదలచేడేమో. నా మనసు శాంతిం చింది. కాని బుఱ్ఱ మాత్రం పని చెయ్యటంలా. ఏం చెయ్యాలో, ఎవర్ని ఆశ్రయించాలో పాలుపోటంలా.

ఎదుటింటి అయ్యరుగారి రేడియోలో రాజమ్మ 'మరి వేరె దిక్కెవ రయ్యా రామ' కమ్మగా పాడుతోంది. ఆ తియ్యని కంఠాన్ని మింగేస్తూ కింద పంజాబీ హోటల్ రేడియోలో 'ముల్తానీ' ఆలాపిస్తోంది. ఆ క్షణా నికి నన్నూ, నా సంసార సాగరాన్నీ, నా అతిథినీ అన్నీ మరిచి ఆ ద్వంద్వ యుద్ధంలో లీనమై పోయాను.

"ఏంరా?" అన్న పిలుపు వినబడగానే వులికిపడ్డాను.

"నన్ను చీకట్లోనే కూచోబెట్టావేంరా?"

పాపం, నిజంగానే అంత చీకటి కమ్ముకు రావటం నేను గమనించనే లేదు. వెంటనే వెళ్ళి దీపం వెలిగించాను. మళ్ళీ గాలరీలో కెళ్ళబోతోంటే, "స్వయం పాకమేంరా?" అని అడిగాడు.

"అబ్బే, కాదండీ."

"మరీ?"

"హోటలు భోజనమండీ."

"హోటలా? ఏం? నీకు వంట చాతకాదూ?"

"అవుతుందండీ, కాని టైం చిక్కదు."

"వోరి వెధవా! వంట చేసుకోటానికే టైం చిక్కదురా? మరి నువ్వు వుద్యోగం చేస్తూంట దేనికీ? పొట్టకోసం కాదూ ? నీ పొట్టకు నువ్వు వుడకేసుకోలేకపోతే ఈ వుద్యోగం ఎందుకూ? ఆ కిరస్తానీ కూడు కుడిచి ఎన్నాళ్లు బతుకుతావురా?"

బ్రాహ్మణ హోటలే నండీ."

"ఆంధ్రులా?"

"అబ్బే కాదు, ఆంధ్రు డెవడేనా హోటలు పెట్టి బాగుపడ్డాడండీ?"

"మరీ?"

"అయ్యరు హోటలండీ."

"అయ్యర్లూ బ్రాహ్మలూ ఒకటేనా?"

"అదేమో తెలీదు కానీండి మొత్తానికి ఆ హోటలు బ్రాహ్మణ హోటలేనని బోర్డుపైన స్పష్టంగా రాసుంది."

"ఏం పాడో, ఏఁవో. వెధవ అనాచారాలూ మీరూనూ," విసుగుతో తల తిప్పేసుకున్నాడు.

టైం చూశాను. ఏడూ యాభై.

"మొదల్లే అట్లా నిల్చున్నా వేఁరా? మధ్యాహ్న మెప్పుడో భోంచేశానా, మరి ఆకలేస్తోంది."

"అయ్యో చెప్పరేఁ, హోటలు కెళ్దామంటారా?"

"ఊఁ పదా. ఏం చేస్తాం, ఖర్మ."

ఇద్దరం బయల్దేరాం.

హోటలు చేరేసరికి సరిగ్గా ఎనిమిదైంది. భోజనం దగ్గర మా అతిథిగారిని ఓ కొత్త రూపంలో చూశాను. అయ్యరుగాడి విసుక్కీ, ఈయనగారి నిదానానికీ సరిపోయింది. వాడిని మరిమరీ అడిగి వేయించుకని, ఒక్కొక్కటీ రుచి చూసి ఆరగించటం చూస్తే, ఈయనే కొన్ని నిమిషాలకి ముందు ఆయ్యర్ హోటళ్ళని తిట్టాడంటే నేనే నమ్మలేకపోయాను.

నా భోజనం త్వరగానే పూర్తయింది. ఇంతలో వోమూల రాజు కాఫీ సేవిస్తూ కనిపించాడు. వాడిని చూడగానే నా పంచప్రాణాలూ లేచి వొచ్చాయి. సాక్షాత్తు భగవత్ స్వరూపంలా కనిపించింది వాడి రూపం నా కప్పుడు. వెంటనే లేచి, "ఇప్పుడే వొస్తానండీ, మీ భోజనం కానివ్వండి," అంటూ ఒక్క గంతులో రాజును చేరుకున్నాను.

"ఒరే బ్రదర్! చాలా ఆపదలో వున్నారా. సహాయం చెయ్యాలి. అయిదే నిమిషాలు;" అంటూ వాడిని కాఫీ అన్నా పూర్తి కానివ్వకుండా వీధిలోకి లాక్కెళ్ళాను.

తిరిగొచ్చేసరికి మా అతిథిగారి భోజనం కూడా పూర్తయింది. వెంటనే రెండు కూపన్లు చించి ఇచ్చి ఇంటి మొహం పట్టాం. తోవలో ఖారా కిల్లీ ఇప్పించాను.

ఇంటికొచ్చాక పక్కలు వేయటం దగ్గిర వొచ్చింది పేచీ. ఉక్కగా వుంది, డాబాపైన పడుకుందామంటాను నేను. ఆరు బయట పడుకుంటే నాకు జలుబు చేస్తుంది, గదిలోనే పడుకుందా మంటాడాయన. వొంటరిగా పడుకోటానికి మాత్రం ఆయనకిష్టం లేదు. విసుక్కుంటూ, నన్ను తిట్టిపోస్తూ, మొత్తానికి ఎలాగైతేయేం చివరకు డాబాపైనే పడుకోటానికి వొప్పుకున్నాడు.

నాకు ధూమపాన మేమేనా అలవాటుందేమో అడిగాడు. ఎన్నడూ లేంది ఆరోజే కొన్న గోల్డ్ ఫ్లేకు ఇవ్వబోయాను. దర్జాగా ధర అడిగాడు. చెప్పాను. దాంతో నా దుబారా ఖర్చుకి నన్ను మరో నాలుగు చీవాట్లు పెట్టాడు. కాని ఇంక ఆయన ఏమన్నా వూరుకుందుకే నిశ్చయించుకున్నాను కాబట్టి నా మనసుకాట్టే కష్టం కలగలేదు.

పక్కపైన వొరిగి, నిద్రవొస్తూన్నా ఆపుకుంటూ 'వెలుగు నీడలు' చదవటం మొదలెట్టాను. ప్రసాదరావుగారు దర్జాగా సిగరెట్ పీలుస్తున్నారు. పిట్టగోడమీద కూచుని.

ఇంతలోకి అంతవరకు గుడ్డిగుడ్డిగా వెలుగుతూన్న స్ట్రీటులైట్లు కాస్తా గప్‌మని ఆరిపోయినై.

"ఇదేవిట్రా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"బ్లాకౌటండీ"

"అంటే?"

"ప్రస్తుతం పట్నం సాంతం చీకటిగానే వుంచుతూన్నారండీ"

"ఎందుకూ?"

"చోరీలు బాగా జరగాలని..."

"ఏవిఁటీ? చోరీలా... చోరీలేనా నువ్వంది?"

"అవునండీ..."

"ఎందుకూ?"

"మరి పోలీసువాళ్ల బతకటం ఎల్లాగండీ"

అది అతని కర్థం అయిందో లేదో. కాని, పాపం, నేను చెప్పిందల్లా నమ్మినట్టున్నాడు.

"అయితే ఈ వూళ్లో చోరీలు జరుగుతున్నాయంటావా?" అన్నాడు, స్వరం తగ్గిస్తూ. ఆ కంఠంలో ఏదో భయం తొణికిసలాడింది.

"ఆహా దర్జాగా," అన్నాను నిర్లక్ష్యంగా.

"నిజం?"

ఒక్క గెంతులో నాదగ్గరికొచ్చి వాలాడు.

"ఏవిఁట్రా సంగతీ?"

"అబ్బే! మీరు భయపట్టం ఎందుకండీ?"

"భయం కాదురా. అసలు సంగతేంటో చెబుదూ."

"ఏంవుందండీ, పట్నంలో చోరీలు జరగటం మామూలేగా"

"ఈ బస్తీలో కూడా జరుగుతున్నాయంటావా?"

"ఆహా"

"ఎప్పట్నించీ?"

"ఎప్పట్నించేవిఁటండీ, మొదట్నించీనీ. అయినా మూడునెల్లనించి మాత్రం భలే గమ్మత్తయిన చోరీ జరుగుతోంది."

"ఏవిఁటదీ?"

"ఒకడున్నాడులెండి. వాడికి అదృశ్యచోరుడు" అన్న బిరుదుగూడ ఇచ్చారు ఇక్కడి వాళ్ళంతా కలిసి. అంటే వాడెవ్వరికీ కనిపించడు. ఇంతవరకూ కనిపించలేదు ఎవ్వరికినీ."

"మరీ?"

"మరేంలేదు. పెట్టెలోని రూపాయలు పెట్టెలోంచే మాయమైపోతాయి, అంతే."

"అయితే దొంగకాదేమోరా, దెయ్యమేమో."

"అబ్బెబ్బే! వాడు మనిషేనండీ. దర్జాగా వుత్తరాలు రాస్తాడుగా. కొందరికి ముందే రాస్తాడు ఫలానారోజు డబ్బు దొంగిలిస్తున్నానని. కొందరికైతే దొంగిలించింతర్వాత ఆ పెట్టెలోనే వుత్తరాలు పెడ్తాడు, మళ్ళీ ఎప్పుడు వొచ్చేదీ తెలియజేస్తూ."

"ఇంత నిర్భయంగా చోరీలు జరుగుతూంటే మరి గౌర్నమెంటు వారేం చేస్తున్నారు?"

"బ్లాకొటండీ."

నా జవాబు వినకండానే దబ్బున కిందికి పరుగుదీశాడు. కాసేపు ట్రంకుల చప్పుడు వినిపించింది, తిరిగొచ్చి, నా పక్కలో కూచుని "ఎట్టారా?" అన్నాడు. అప్పటికే మొహం పాలిపోయింది. కళ్ళల్లో భయం స్పష్టంగా గోచరిస్తోనేవుంది.

"ఏంటండీ?"

"ఇదే. ఈ చోరీ విషయమేరా"

"అయ్యో! మీరు భయపడ్తున్నారా?"

"దొంగ అంటే భయంకాదురా?"

"ఈఇంటి కేం భయంలేదండీ..."

"ఏం?"

"మా సంగతి ఇక్కడివాళ్ళ కందరికీ తెలుసు. నిన్న కళ్లుతెరిచిన కుఱ్ఱకుంకక్కూడా తెలుసు. సాహెబు సంపాదనంతా బూబమ్మ కుట్టుపోతకు సరిపోతుందని."

"మీ సంగతి అటుంచరా. ప్రస్తుతం నేనున్నాగా?"

"వుంటే ఏం?"

"నీతో దాచటమెందుకూ, నా దగ్గిర కొంత డబ్బుందిరా."

"డబ్బా...? ఎంతమాత్రం?"

"ఏదోలే, ఐదొందలపైచిల్లర వుంటుందనుకో"

"అయినా భయం లేదండీ..."

"ఏమోరా నాకు భయంగానే వుందీ"

"ఎందుకండీ, మిమ్మల్నిప్పుడెవడు చూడొచ్చాడూ."

"పెట్టెల్లోంచి డబ్బు మాయంచేసేవాడికి ఇంతమాత్రం తెలీదురా?"

నేను వూరుకున్నాను.

దాంతో ఆయనగారి భయం స్థిరపడ్డది.

"ఏ(వి(ట్రా వుపాయం?" అన్నాడు, దీనంగా నావేపు చూస్తూ.

నేనింకా ఆలోచిస్తూనే వున్నాను. ఆయన అదుర్దా మరీ హెచ్చయింది.

"ఏదేనా వుపాయం చూడరా బాబూ. నన్ను రక్షించవూ?"

"అయితే వోపని చేద్దామండీ," అన్నాను. ఆయన మొహం ఒక్కసారి వికసించింది.

"ఈ దొంగ వున్నాడే, వాడొహ గమ్మత్తైన మనిషని ఇదివరకే చెప్పాగా, డబ్బంతా వొక్కసారి దొంగిలించడు. వంతుల ప్రకారం తీసికెళ్తాడు. మొదటిసారి ఐదోవంతుకంటే ఎక్కువ దొంగిలించడు."

అదేవి(టీ?"

"అట్టా వాడి పద్ధతి... అంచాత మీరు పెట్టెలో కొంత డబ్బు మాత్రం వుంచి తక్కిందంతా ఇంకెక్కడేనా దాచెయ్యండి."

"వాడి కంతమాత్రం తెలీదురా?"

"అబ్బే, వాడొట్టి ట్రంకు దొంగమాత్రమేనండీ."

"అంతా దాచేస్తే?"

"అమ్మో, పసిగట్టేయగల్డు."

"అయితే పెట్టెలో ఎంత వుంచమంటావ్?"

"మీ ఇష్టం."

"చెబుదూ"

"వో యేభై వుంచండి."

"అబ్బో! పది రూపాయలు మాయమవుతాయన్నమాట."

"అన్నమాటే"

"అంతకంటే తక్కువైతే"

"ఏంలేదు, వాడు ఆ కాస్తా వొక్కసారే పట్టుకెళ్తాడు."

"సరే సరే. యేభై యే పెడ్దాం," అంటూ లేచి వెళ్లి పెట్టి తీసుకొచ్చాడు. పెట్టి తెరిచి అందులోంచి నోటకట్ట తీసి, పదిరూపాయలనోట్లు అయిదుమాత్రం అందులో వుంచి, తక్కినవి చేతిరుమాల్లో కట్టాడు.

"ఎక్కడ దాద్దాం?" అని అడిగాడు.

"ఎక్కడెందుకూ. మీ తలకిందే పెట్టుకు పడుకోండి."

కొంచెంసేపు ఆలోచించి, లేచి పెట్టికి భద్రంగా తాళంవేసి, దాన్ని యథాస్థానాన్నే వుంచి వొచ్చి తన చొక్కావేసుకుని, జేబులో నోట్లకట్ట పెట్టుకుని వెళ్లి బోర్లగిలా పడుకున్నాడు. ఇంక నాతో వొక్కమాటా మాట్టాడలేదు. నేనూ వొరిగాను.

తెల్లవారుఝామున నన్నెవరో తట్టి లేపితె ఉలిక్కిపడి లేచి కూర్చున్నాను. ఎదట ప్రసాదరావుగారు ప్రత్యక్షం, బిక్కమొహంతో.

"ఏఁవిటండీ, ఏఁవిటి?" అని అడిగాను అదుర్దాగా.

"అయిందిరా" అన్నాడు హీనస్వరంతో,

"ఏం విటయిందీ!"

"పదిరూపాయలూ మాయమైనై."

"ఆం?... నిజంగా?"

"ఇదిగో పక్కనే తెరిచివున్న పెట్టిలోంచి వో చిన్న చీటీముక్క తీసిచ్చాడు. కళ్లనులుముకుని చదివితె అందులో ఇల్లావుంది: "మళ్ళీరేపు"

నేను మాట్టాడకండా కూచున్నాను.

"ఒరేయ్, మావూరి బండెప్పుడో తెలుసా?"

"మీరు వెళ్తారా?"

"ఇంకా ఏం చెయ్యమన్నావ్?"

"అయ్యో ఒక్కరోజన్నా వుండకండా."

"ఇది చాల్దూ? ఇంకానా?... ఒరే బాబూ! నన్నీపట్నం వించి బయట పడేశావంటే నీకు చాలా పుణ్యముంటుందిరా. నీమేలెప్పటికీ మరవను. ఇంకలే"

"సరే. మీరు ముందు స్నానమదన్నా చెయ్యండి."

"బతికి బయటపడితె అన్నీరా. నువ్వులే. ఇంక మాట్టాడకు,"నా రెక్కపట్టి లేపాడు.

మాట్టాడకండా కిందికి వెళ్ళిపోయాను. కాలకృత్యాలు తీర్చుకుని వొచ్చేసరికి ఆయనగారు కోటు వేసుకుని సిద్ధంగా వున్నారు.

"పోనీ ఫలహారమన్నా చేసి వెళ్ళరూ, ఇంకా చాలా టైముంది."

"నువు ముందు స్టేషనుకి నడవరా బాబూ! ఈ పట్నం నించి బయటపట్టం ఎప్పుడెప్పుడా అని నాకుంటే... మరి జన్మలో పట్నంపేరు తలవనురా బాబూ!"

బయలుదేరాం. తోవలో ఒక్క మాటా లేకుండానే స్టేషను చేరుకున్నాం. బండి రావటానికి అప్పటికింకా చాలా టైముంది. నా బలవంతం పైనే ఆయన అక్కడే మొహం కడుక్కుని, నాలుగు ఇడ్లీలూ, కప్పు కాఫీ సేవించాడు.

సరిగ్గా తొమ్మిదిన్నరకి రైలొచ్చింది. పెట్టెలో కూచున్నాక ఓ పెద్ద నిట్టూర్పు విడిచాడు.

"మీ రిట్టా వెళ్ళిపోవటం నాకు చాలా విచారంగా వుందండీ. అసలు నేనేమీ చెయ్యలేకపోయినందుకు నాకు సిగ్గువేస్తోంది."

"ఒరే అబ్బాయ్! నువ్వు అట్టా ఏమీ అనుకోకు. నీమేలు నేనెప్పటికీ మరిచిపోలేను."

రైలు కదిలింది.

స్టేషను దాటి ఈవలికొచ్చేసరికి ఎదురుగా హాజరయ్యాడు రాజు, చిరునవ్వుతో.

"ఏం?" అన్నాడు.
"ఓ కే" అన్నాను.

"వెంటనే వాడు నాచెయ్యి పుచ్చుకుని రాయల్ హోటలులోకి దారితీశాడు. గబగబా ఆర్డరు ఇవ్వటం మొదలెట్టాడు.

నేను మెల్లిగా పర్సుతీశాను. అందులోంచి ఓ పదిరూపాయల పాతనోటు తొంగిచూసింది.